17వ
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
సోమవారం,15 జూలై 2024


## చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



**నూజివీడు,మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పథకాన్ని అమలులోకి తీసుకువచ్చిన నేపథ్యంలో నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రులు నారా లోకేష్ ,కొలుసు పార్థసారధి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపిన గ్రామ భవన నిర్మాణ కార్మికులు,తెలుగుదేశం, జనసేన బిజెపి నేతలు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ పొట్లూరి సత్యనారాయణ, క్వారీ వెంకట్రావు,భవన నిర్మాణ కార్మికుల నూజివీడు పట్టణ,మండల అధ్యక్షులు తోట వెంకటరావు, భవన నిర్మాణ కార్మికులు, టిడిపి ,జనసేన ,బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు జిల్లా నూతన ఎస్పి బాధ్యతలు స్వీకారం



**ఏలూరు,మేజర్న్యూస్:** ఏలూరు జిల్లా ఎస్పీగా ఈ నెల 15వ తేది సోమవారం కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఉదయం 9.45 గం.లకు బాధ్యతలు స్వీకరిస్తరు.

# పర్యాటక కేంద్రంగా కొల్లేరు





**– కైకలూరులో మంచి నీటి సమస్య పరిష్కరానికి కృషి**
**– ఎంపి 'పుట్టా 'వెల్లడి**
**– అభినందన సభలో కామినేని, మంత్రులు పార్ధసారధి,రవీంద్ర**

**కైకలూరు,మేజర్న్యూస్:** ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, కైకలూరు ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్‌ల అభినందన సభ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ కేంద్రం నుండి జల్ జీవన్ పథకం ద్వారా నిధులు మంజూరు చేయించి కైకలూరులో త్రాగునీటి సమస్య పరిష్కారిస్తానని, కొల్లేరు పక్షుల సంరక్షణ,అందమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, త్వరలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. ఏలూరులో వందేభారత్ రైలు స్టాపు ఏర్పాటుకు కేంద్రంతో మాట్లాడటం జరిగింది. త్వరలో ఏలూరులో వందే భారత్ రైలు ఆగుతుంది అని తెలిపారు. భద్రాచలం–కొవ్వూరు రైల్వేలైను ప్రాజెక్టుపూర్తికి కృషి చేస్తున్నానన్నారు. చదువుతున్న యువతకు తరచుగా జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పిస్తానన్నారు. ఏలూరు లోని జిల్లా కేంద్ర ఆసుపత్రిని కేంద్ర నిధులతో ఆధునికరిస్తానన్నారు. ఎంపీ లాడ్స్ నిధులతో నాయీబ్రాహ్మణులకు,బిసీ లకు కల్యాణ మండపాలు నిర్మిస్తామన్నారు.పామాయిల్ రైతులకు టన్నుకు మద్దతు ధర 17 వేల సాధిస్తానని మహేష్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిధులుగా రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి, గనులు,ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర,మాజీ యంఎల్సీ కమ్మిలి విఠల్,మాజీ యంఎల్ఏలు ఘంటా మురళీ రామకృష్ణ,వెంకటేశ్వర రావు, వేలాదిగా కూటమి నాయకులు కార్యకర్తలు తరలి వచ్చారు. అంతకు ముందు కైకలూరు ప్రధాన రహదారుల్లో ఘనంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

# ప్రజలందరికీ సుపరిపాలన





**– ఎమ్మెల్యేలు నాయకర్,పులపర్తి,కాగితపు వెల్లడి**

**మొగల్తూరు,మేజర్న్యూస్:** రాష్ట్రంలో ఎన్డీఏ కూటమికి అత్యధిక మెజార్టీ ఇచ్చిన రాష్ట్ర ప్రజలందరికీ మంచి పాలన అందిస్తామని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. ఆదివారం మండలంలోని జగన్నాధపురం గ్రామంలో ఎన్డీఏ కూటమి విజయోత్సవ ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. జనసేన పార్టీకి నూటికి నూరు శాతం ఎమ్మెల్యేలు ఎంపీలు విజయం సాధించి ప్రపంచమంతా జనసేన పార్టీ విజయాన్ని చారిత్రాత్మక విజయంగా అభివర్ణించడం దానికి జనసేన పార్టీ వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్ కృషి వల్లనే అని తెలిపారు. గడిచిన వైసిపి ప్రభుత్వం ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు సక్రమంగా నిర్వహించకుండా అవినీతి పరిపాలన అందించడం వల్లే రాష్ట్ర ప్రజలు బ్రహ్మాండమైన తీర్పు ఎన్డీఏకు అందజేశారని ఆయన గుర్తు చేశారు. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నుండి వయా జగన్నాధపురం మోలపర్రు బీచ్ వరకు నాలుగు వరసల రహదారి అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. పెడన శాసనసభ్యులు కాగితపు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గడిచిన 5 సంవత్సరాలు రాష్ట్రం అధోగతి పాలు అవ్వడం వల్లే ప్రస్తుతం ఎన్డిఏ కూటమికి ఓటర్లు బంపర్ మెజార్టీతో గెలుపొందించారని అన్నారు. తన తండ్రి కాగితపు వెంకట్రావు ను దృష్టిలో పెట్టుకుని నన్ను కూడా ఆత్మీయ సమావేశానికి ఆహ్వానించిన ఆహ్వానం కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.తొలుత ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి ఆంజనేయులు,పెడన శాసనసభ్యులు కాగితపు కృష్ణ ప్రసాదు,మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు,నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పొత్తూరి రామరాజు,జిల్లాటిడిపిఅధ్యక్షుడుమంతెన రామరాజు, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళి కృష్ణలను సత్కరించారు. అనంతరం గ్రామంలో నేతలు ఏర్పాటుచేసిన టిడిపి జనసేన పార్టీలకు చెందిన జెండాలను అభిమానులు సమక్షంలో ఎగరవేశారు.

## జనసైనికుడిని పరామర్శించిన ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** తాడేపల్లిగూడెం నియోజకవర్గం స్థానిక ఒకటోవ వార్డు జనసేన ప్రెసిడెంట్ గణేశుల పవన్ ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయాల పాలయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పవన్ కు మెరుగైన వైద్యం అందించాలని స్థానిక ఒకటవ వార్డు ఇన్చార్జిలకు సూచించారు. అనంతరం వైద్య నిమిత్తం ఖర్చులకు కొంత డబ్బును మరియు నెలకి సరిపడా నిత్యవసర సరుకులు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు జనసేన ఇంచార్జ్ చేపల రమేష్, గురుజి సూరిబాబు, గుండు మొగుల అయ్యప్ప, పైబోయిన వెంకటరామయ్య, అడబాల మురళి, బయనపాలేపు ముఖేష్, సందక రమణ తదితరులు పాల్గొన్నారు.


## గునుపూడి సౌత్ డ్రైన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే పులపర్తి





**భీమవరం,మేజర్ న్యూస్:** భీమవరం మండలం దిరుసుమర్రు గ్రామంలోని గునుపూడి సౌత్ డ్రైన్‌ను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుర్రపు డెక్క తొలగింపుకు డ్రోన్ స్ప్రేయర్ ను ఉపయోగించి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు,కౌరు పృధ్వి శంకర్,వ్యవసాయ శాఖ, డ్రైనేజీ అధికారులు,రైతులు,జనసేన బిజెపి టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ అలంకరణలో జగన్నాథుడు



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** చిన్న వెంకన్న ఆలయానికి ఉపాలయమైన లక్ష్మీపురం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర సంతాన వేణుగోపాల జగన్నాథ స్వామి వారి ఆలయంలో శ్రీ జగన్నాథ స్వామి వారి రథోత్సవం అత్యంత వైభవముగా నిర్వహిస్తున్నారు.శ్రీ వైఖానస ఆగమ విధిగా దశావతార అలంకారాల లో భాగంగా 8వ రోజు స్వామివారు చేతిలో పిల్లను గోవి ఊదుతూ శ్రీ కృష్ణవతార అలంకారంలో భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు.స్వామివారిని దర్శించుకున్న భక్తులు మంత్రముగ్ధులై శ్రీకృష్ణ నామస్మరణలతో పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు.

## గోపవరం,సూరేపల్లిలో పలు కుటుంబాలకు మంత్రి పార్ధసారధి పరామర్శ







**ముసునూరు,మేజర్న్యూస్:** ముసునూరు మండలం, గోపవరం గ్రామానికి చెందిన గుడ్డేటి రవి కుమారుడు ఇటీవల మరణించడంతో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పరామర్శించారు.

వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా అదుకుంటానని మంత్రి భరోసా ఇచ్చి ఓదార్చారు. అనంతరం సూరేపల్లి గ్రామానికి చెందిన ఓబిళ్ళనేని లక్ష్మీనారాయణ, ముల్లంగి, పుల్లయ్య, బొట్ల, జగన్నాధం, వీరు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆదివారం ఇంటింటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పరామర్శించారు. మరణించిన పెద్దలందరూ పార్టీకి ఎంతో సేవలు చేసారని వారిని తాను,మా పార్టీ ఎన్నడికి మరువలేమని వారి కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ప్రభుత్వం అదుకుంటుందనీ ఓదర్చారు.వారి కుటుంబాలకు ఏవిధమైన అవసరం ఉన్నా నన్ను నేరుగా కలిస్తే తగిన సహాయ సహకారం ప్రభుత్వం తరుపున వెంటనే అందజేస్తానని భరోసా ఇచ్చారు. తదనంతరం మరణించిన వారి చిత్ర పటాలకు పూలమాలతో నివాళులు అర్పించారు. మంత్రి వెంట గ్రామ పెద్దలు నాయకులు ,స్థానిక నాయకులు వున్నారు.


# బండిరేవు వద్ద ఎర్రకాలువపై వంతెన నిర్మించాలి


**– ఎమ్మెల్యే బాలరాజుకు టి.నర్సాపురం రైతుల వినతి**



**టీ.నర్సాపురం,మేజర్న్యూస్:** టి.నర్సాపురంగ్రామంనుంచి కొమ్ముగూడెం వెళ్లే రహదారి మరమ్మత్తు చేయించి బండి రేవు వద్ద ఎర్రకాలపై వంతెన నిర్మించాలని ఆదివారం పలువురురైతులు,గ్రామస్తులుపోలవరం శాసన సభ్యులు చిర్రి బాలరాజుకు నివాసం వద్ద వారికి వినతి పత్రాన్ని అందజేశారు. జీలుగుమిల్లి మండలం బర్రెలంక పాడులోని ఎమ్మెల్యే గృహానికి వెళ్లి సమస్యలు వివరించారు. వంతెన లేకపోవడం వల్ల నందమూరి విద్యాసాగర్ ప్రాజెక్టు కలంగి పడినప్పుడల్లా వరద విపరీతంగా రావడం తోఅటు, ఇటు రాకపోకలు నిలిచిపోతున్నాయని, పొలం పనులపై ప్రతిరోజు రైతులతో పాటు వందలాది మంది రైతుకూలీలు కూడా ఇటువైపే వెళ్ళవలసి ఉంటుందని తెలిపారు. వంతెన లేకపోవడంవల్ల చాలా ఇబ్బందికరంగా ఉందని, గతంలో వరద ఎక్కువ రావడం వల్ల కొన్ని పశువులు కూడా చనిపోయిన సందర్భాలు ఉన్నాయని శాసనసభ్యులకి విన్నవించుకున్నారు. వెంటనే స్పందించిన శాసనసభ్యులు బాల రాజు వెంటనే ఈ సమస్యపై దృష్టి పెట్టి నాలుగు నెలల్లో వంతెన పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఆయన హామీతో రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## రూ.7 కోట్లతో నిర్మించే వాటర్ ట్యాంకు పనులకు శంకుస్థాపన





**– పాల్గొన్న ఎంపీ పుట్టా మహేష్,ఎమ్మెల్యే ధర్మరాజు,గన్ని**

**ఉంగుటూరు,మేజర్ న్యూస్:** ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ ఆదివారం ఉంగుటూరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత తెలుగుదేశం ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుని భీమడోలులోని వారి కార్యాలయంలో కలసి సంస్థాగత విషయాలను చర్చించారు.

అనంతరం ఉంగుటూరు మండలం, నారాయణపురంలోని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుని వారి క్యాంపు కార్యాలయంలో కలిసి నియోజకవర్గ అభివృద్ధి పై సమీక్ష జరిపారు. తదుపరి చల్లమ్మ తల్లి,భద్రకాళి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఉంగుటూరు మండలం, పెద్దవెలమెల్లి గ్రామంలో రూ.7 కోట్లతో నిర్మిస్తున్న ఆర్ డబ్ల్యు ఎస్ వాటర్ ట్యాంకు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రూ.7 కోట్ల 10 లక్షలతో 12 వాటర్ హెడ్ ట్యాంకులు,37 కిలోమీటర్లు పైప్ లైన్స్ నిర్మాణం,4 బోర్ సెట్లు నిర్మాణం చేయనున్నారు.

ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ధర్మరాజు ,గన్ని వీరాంజనేయులు, స్థానిక జడ్పీటీసీ, ఎంపిపి, ఎంపీ టీసీ,సర్పంచ్ ,వందలాదిగా స్థానిక నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

## నేడు జిల్లా అభివృద్ధిపై సమీక్ష సమావేశం

**ఏలూరు,మేజర్న్యూస్:** 15వతేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వివిధఅంశాలపైసమీక్షసమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయం గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొంటారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లా కలెక్టర్ వారి ఆదేశముల ప్రకారం ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పిజిఆర్ఎస్) కార్యక్రమం జిల్లా కలెక్టర్ కార్యాలయం గోదావరి సమావేశ మందిరంలో జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## సిఐటియులో చేరిన ఆటో డ్రైవర్లు



**ఏలూరు,మేజర్ న్యూస్:** సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఏలూరు నగరం,చొదిమెళ్ళ ఆటో స్టాండ్ డ్రైవర్లు 20 మంది ఆదివారం ఉదయం సిఐటియులో చేరారు. ఆటో డ్రైవర్లకు ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి సూరిబాబు, జె గోపి అభినందనలు తెలిపారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై సిఐటియు అనేక సమరశీల పోరాటాలు నిర్వహించిందని తెలియజేశారు. డ్రైవర్ల అందరూ ఆటో రికార్డులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలగాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్రతి ఒక్కరూ యూనిఫామ్ ధరించాలని కోరారు. ఏలూరు నగరంలో సీసీ కెమెరాల ద్వారా విధించిన ఇ–చలానాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వై బాలాజీ,జి డేవిడ్ రాజు,వి దుర్గారావు, ఎల్ వెంకటేశ్వరరావు, సిహెచ్ ప్రసాదరావు, ఎస్ చినబాబు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల బాలికల పాఠశాలకి శాశ్వత భవనాలు

**– నిర్మించాలని ఎమ్మెల్యే చింతమనేనికి పిడిఎస్‌యు నేతల వినతి**



**పెదవేగి,మేజర్ న్యూస్:** పెదవేగి మండలం వంగూరు గ్రామంలో అద్దె భవనంలో నిర్వహించబడుతున్న గురుకుల పాఠశాలకి స్థలం కేటాయించి శాశ్వత భవనాలు నిర్మించాలని ఆదివారం పిడిఎస్‌యు నాయకులు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ పెదవేగి మండలం వేగవరం గ్రామంలో ఉన్నటువంటి హేలాపురి ఇంజనీరింగ్ కళాశాల సంబంధించిన భవనాల్లో అద్దెకి 2017 సంవత్సరంలో జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్ని ప్రారంభించడం జరిగిందని నాని తెలిపారు.

ఇన్ని సంవత్సరాలు అవే బిల్డింగుల్లో క్లాసులు, హాస్టల్ అరకోర వసతులతో కాలం వెల్లదీశారని అయితే గత 5 నెలల క్రితం హేలా పురి కళాశాల యాజమాన్యం గురుకుల పాఠశాల ఉన్నటువంటి భవనాలను ఖాళీ చేయమని చెప్పిన నేపథ్యంలో పాఠశాల ప్రిన్సిపల్,సిబ్బంది పై అధికారుల ఆదేశాలతో అనేక ప్రైవేట్ బిల్డింగులు వెతికి ఆఖరికి వంగూరు గ్రామంలో ఉన్నటువంటి పాత ఒక ప్రైవేట్ కళాశాలసంబందించిన భవనంలోకి గురుకుల పాఠశాలని మార్చడం జరిగిందని అయితే అక్కడ చాలీచాలని తరగతి గదిలోనే విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. పంట పొలాల మధ్యలో పాఠశాల ఉండటంవల్ల పాముల బెడద ఉంటుందని నాని ఆందోళన వ్యక్తం చేశారు. కనుక విద్యార్థులు పట్ల దయఉంచి గురుకుల పాఠశాలకి స్థలం కేటాయించి శాశ్వత భవనాలు నిర్మించే విధంగా చర్యలు తీసుకుని విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలని నాని శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో యం.క్రాంతి,సి యశ్వంత్ యు.చందన్ ఐ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కాశీ ఖండం గ్రంథాలు బహూకరణ



**పాలకోడేరు,మేజర్ న్యూస్:** ప్రజల్లో ఆధ్యాత్మిక భావనలు పెంపొందించేందుకు, తద్వారా సమాజంలో శాంతి నెలకొనేందుకు ఇలాంటి గ్రంథాలు పంపిణి చేయడం అభినందనీయమని శృంగవృక్షం ఆర్య వైశ్యసంఘం అధ్యక్షుడు గ్రంధి రాజా అన్నారు. ఆదివారం కూర్మాల నారాయణరావు, వెంకటేశ్వరమ్మ దంపతులు శ్రీ వేదవ్యాస మహర్షి విరచిత కాశీ ఖండం గ్రంథాలను సంఘానికి బహూకరించారు. ఉపాధ్యక్షుడు పూర్ణారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇలాంటి గ్రంథాలను అధ్యయనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ, కోశాధికారి అత్యంవాసు, కూర్మాల మురళి,కూర్మాల రాజా,జయసుధ ,సంఘసభ్యులు కృష్ణ ప్రసాద్,శ్రీను, నాగరాజు, రమేష్ కుమార్,రాంబాబు పాల్గొన్నారు.

# గౌరీపట్నంలో మొక్కు తీర్చుకున్న జనసేన అభిమాని



**పెంటపాడు,మేజర్ న్యూస్:** బొలిశెట్టి శ్రీనివాస్ జనసేన ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే గౌరీపట్నం వెళ్లి మొక్కును తీర్చుకున్న తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం ఉమామహేశ్వరం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు మర్రిపూడి చిన్న. ఎమ్మెల్యేగా బొలిశెట్టి శ్రీనివాస్ ఘనవిజయం సాధించడం కొణిదల పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రి కావడంతో దేవరపల్లి మండలం గౌరీపట్నం నిర్మలగిరి చర్చి నందు జనసేన జెండా పట్టుకుని మోకాళ్ళతో 163 మెట్లు ఎక్కి బొలిశెట్టి మీద అభిమానాన్ని చాటుకుని జనసేన నాయకుడు చిన్న తన మొక్కు చెల్లించుకున్నాడు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, మిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# డెంగ్యూ జ్వరంతో
# యువకుడి మృతి అనే ప్రచారం- డెంగ్యూ కాదు

## - టైఫాయిడ్ అని వైద్యాధికారులు స్పష్టీకరణ

**పెదవేగి, మేజర్‌న్యూస్:** పెదవేగి మండలం గార్లమడుగు పంచాయతీ వెంకట కృష్ణాపురంలో ఓయువకుడుపది రోజులుగా జ్వరంతో బాధపడుతూఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు.మొయిద్దీన్ అనే యువకుడు డెంగ్యూ జ్వరంతో మృతి చెందాడంటూ గ్రామంలో ప్రచారం జరగడంతోగ్రామస్తులు భయాందోళనలకు గురయ్యారు. వెంకట కృష్ణాపురం గ్రామానికి చెందిన పఠాన్ మొయిద్దీన్ కారు డ్రైవర్గా పనిచేసున్నాడు. అతను గత పదిరోజులుగా జ్వరంతో బాదపడుతూ ఏలూరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఆదివారం ఉదయం పదిగంటల సమయంలో ఇంటి దగ్గర ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే అతనిని



ఏలూరు ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మూడుగంటల సమయంలో మొయిద్దీన్(22) మృతిచెందాడు.

అతడి మృతికి డెంగ్యూ కారణమనే ప్రచారం విస్తృతంగా సాగింది. దీంతో స్పందించిన పెదవేగి ప్రాదమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మొయిద్దీన్ చికిత్స తీసుకున్న ప్రైవేటు ఆస్పత్రికి వెళ్ళి, రిపోర్డులను పరిశీలించి చికిత్స విదానాన్ని తెలుసుకున్నారు. ఇది టైపాయిడ్ లక్షణాలు మాత్రమేనని డెంగ్యూ కాదని పీహెచ్సీ వైద్యాధికారులు డాక్టర్ పూర్ణిమ. డాక్టర్ మాదవి తెలిపారు. టైపాయిడ కు చికిత్స తీసుకుంటూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లుగా తెలుస్తుందని వైద్యులు వివరించారు.

# భార్యపై అనుమానంతో ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య



**దెందులూరు,మేజర్ న్యూస్:** దెందులూరు మండలం ముప్పవరం పంచాయతీ పరిధిలోని నాగహనుమాన్ ఫ్యాక్టరీ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. భార్యపై అనుమానంతో ఫ్యాక్టరీలోని చెట్టుకు ఉరివేసుకుని రాజు మాంజీ (24) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికుల సమాచారం.

రాజు మాంజీది బీహార్ రాష్ట్రం గాయ్ ఘాట్‌కు చెందిన వ్యక్తిగా నిర్ధారించిన పోలీసులు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి దెందులూరు ఎస్ఐ స్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మొక్కలు నాటండి - పర్యావరణాన్ని కాపాడండి



**భీమవరం,మేజర్ న్యూస్:** మొక్కలను నాటండి-పర్యావరణాన్ని కాపాడండి - పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం వార్డెన్స్ సిహెచ్ భానుమణి,ఎం శ్యామల అన్నారు. వెనుకబడిన బాలికల వసతి గృహంలో శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలను నాటడం కాదు వాటిని సంరక్షించాలని, ప్రతి విద్యార్థి ఒక్క మొక్కనైన పెంచుకోవాలని సూచించారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మన ఆరోగ్యం కూడా ఎంతో బాగుంటుందని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఇటువంటి చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని, వసతి గృహంలో వివిధ రకాల 36 మొక్కలను నాటమాని అన్నారు. న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, అరసవల్లి సుబ్రమణ్యం, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, ఎస్ కె చాన్ భాషా, కొంద్రు శ్రీనివాస్‌లు విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు

## ఎఈఎల్‌సి బిషప్ పరదేశి బాబు దంపతులకు సత్కారం



**భీమవరం,మేజర్ న్యూస్:** ఆంధ్ర ఇవాంజీలికల్ లూథరన్ చర్చిస్ (ఎఈఎల్ సి) అధ్యక్షులు మోడరన్ బిషప్ కెఎఫ్ పరదేశి బాబు దంపతులను భీమవరం బేతనిపేట చర్చిలో సంఘ సభ్యులు సత్కరించారు. బిషప్ పరదేశి బాబు మాట్లాడుతూ లూథరన్ సంఘాలకు చెందిన క్రైస్తవులందరూ ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. లూథరన్ సంఘాలకు చెందిన సభ్యులందరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని, ఏసు క్రీస్తు వారు చెప్పిన మాటల ప్రకారం ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని, పేదలకు సహాయం చేయాలని అన్నారు. అనంతరం పరదేశి బాబు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో డి వర్గీస్ దానియేలు,డా పట్టా దేవరాజ్, పిడి విల్సన్,పాస్టర్ ఎస్ పుష్ప రాజ్, గంటా సుందర్ కుమార్,పీ సుదర్శన్ కుమార్, పీజే కేనాడి, పాక రతన్,బంధేలా సునీల్, కే బన్నీ విక్టర్,ఎన్ సుగణ లిల,పట్టా ఇందిరా, జీపీపీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టిసీమ నీటికి జలహారతి ఇచ్చిన ఎమ్మెల్యే కామినేని



**కైకలూరు,మేజర్ న్యూస్:** కైకలూరు మండలం వింజరం లో పట్టిసం నుంచి వచ్చిన నీరుని జలహారతి ఇచ్చి విడుదల చేసిన శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు,నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు,కో- కన్వీనర్ భలే ఏసురాజుసర్పంచ్ ధర్మరాజుల నాగమణి, ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు (రాజీ),పెరిచర్ల ప్రసాద్ రాజు, బిజెపి నాయకులు పైడిపాటి శివశంకర్,నర్సిపల్లి అప్పారావు,తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ,జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్ (బాబి), వరహాపట్నం మాజీ సర్పంచ్ బోయిన శ్రీనివాసరావు,మండల టిడిపి ప్రధాన కార్యదర్శి పి.రాధకృష్ణ, తామరకొల్లు యమ్.పి.టి.సి గంగుల వెంకటనర్సమ్మ, జిల్లా టిడిపి రజక సాధికారిక డైరక్టర్ కంచర్ల రామకృష్ణ,బోడావుల ఎలీషారావు, జనసేన నాయకులు దుర్గం శ్రీనివాస్, పెరిచర్ల వినయ్ వర్మ,శ్యామ లాంబపురం గ్రామ టిడిపి అధ్యక్షులు ఈదర నాగరాజు,గంగుల నాంచారయ్య, పోసిన పాండురంగారావు,నాగనబోయిన నాంచారయ్య, కూనపరెడ్డి కోటేశ్వరరావు, గంజాల శ్రీనివాసరావు ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముంపులో నారుమడులు - ఆందోళనలో రైతులు

**నరసాపురం రూరల్,మేజర్ న్యూస్:** సార్వ సీజన్ ప్రారంభంలోనే రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రతిరోజు రాత్రి వేళల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తూ ఉండటంతో నారుమడులు ముంపునకు గురయ్యాయి. మడులు ఏపుగా ఎదుగుతున్న సమయంలో వర్షాలు విస్తారంగా రావటం మురుగునీరు వెళ్లే మార్గం లేక ముంపులోనే ఉండిపోయాయి. నరసాపురం మండలంలో 9,వేల200 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఎలమంచిలిలో 6,వేల300 ఎకరాలు, మొగల్తూరులో 2,వేల500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. నరసాపురం మండలంలో సుమారు 50 ఎకరాలలో నారుమడులు ముంపునకు గురైనట్లు వ్యవసాయ శాఖ అధికారులుప్రాథమిక అంచనా వేశారు.ముంపునకు గురైన నారుమడులు సుమారు వెయ్యి ఎకరాలలో నాట్లు వేసేందుకు సరిపోతాయి. మండలంలోని సీతారాంపురం, రుస్తుంబాధ, వైయస్ పాలెం, సరిపల్లి, మల్లవరం, కొప్పర్రు తదితర గ్రామాల్లో నారుమడులు ముంపులో ఉన్నాయి. నీటిని బయటికి తోడేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ మురుగు కాలువలలో నీరు అధికంగా ఉండటం వల్ల కిందికి వెళ్ళటం లేదని రైతులు చెప్తున్నారు. ఇదిలా ఉండగా



ముంపునకు గురైన గ్రామాల్లో ప్రాథమిక అంచనా వేశామని, రైతులతో మాట్లాడి ముంపు వివరాలను నమోదు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారి సామ్యూల్ జాన్సన్ తెలిపారు. సుమారు49 హెక్టార్లలో నారుమడలు ముంపుకు గురైనట్లు ఆయన తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామని ఏవో తెలిపారు.

# బిఎస్ రావుకు శ్రీ చైతన్య ఉపాధ్యాయుల నివాళులు



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత బొప్పన సత్యనారాయణ రావు ప్రథమ వర్ధంతి సందర్భంగా తాడేపల్లిగూడెం చిన్న తాడేపల్లిలోని శ్రీ చైతన్య పాఠశాల నందు బిఎస్ రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన పాఠశాల ఉపాధ్యాయులు. విద్యా వ్యవస్థలో ఒక విలక్షణ శైలితో విద్యాలయాలు నెలకొల్పి లక్షలాది విద్యార్థులకు విద్యను అందించిన మహెూన్నత వ్యక్తి బిఎస్ రావు అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రసాద్ కొనియాడారు. చెన్నై హైదరాబాదు వంటి నగరాలకే పరిమితమైన విద్య విధానాన్ని విజయవాడకు తీసుకువచ్చిన ఘనత బిఎస్ రావు కే దక్కుతుందని, ఐఐటీలను తీర్చే సంస్థగా శ్రీ చైతన్య ముందు వరుసలో నిలిచిందని ఏజిఎం సుంకర పార్థసారథి తెలియజేశారు. పాఠశాల డీన్ నాగార్జున, సి బ్యాచ్ ఇంచార్జ్ సత్యనారాయణ పలువురు ఉపాధ్యాయులు విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులు, తధనుగుణంగా తెలుగు రాష్ట్రాలలో తయారవుతున్న ఐఐటీయన్లు, డాక్టర్లు గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా రీజనల్ కోఆర్డినేటర్ రామారావు ప్రైమరీ ఇంచార్జ్ శ్రీలక్ష్మి, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ స్వరూప మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు బిఎస్ రావు చిత్రపటానికి పుష్ప గుచ్చాలనుంచి ఘనంగా నివాళులర్పించారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు అభినందన సభ

**- జగ్గంపేట ఆర్యవైశ్యుల ఆదరణ మరువలేనిది**
**- జ్యోతుల నెహ్రూ దంపతులు**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జగ్గంపేట మండలం ఆర్యవైశ్య సేవా సంఘం, జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మణి దంపతులను ఘనంగా సత్కరించి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షులు కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) అధ్యక్షత వహించగా జ్యోతుల నవీన్ సతీమణి లక్ష్మీదేవి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. అభినందన గ్రహీత జ్యోతుల నెహ్రూ దంపతులను ఆర్యవైశ్యులందరూ ఘనంగా సత్కరించి అయోధ్య రామ మందిర నమూనా జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేను మొట్టమొదటిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సమయంలో నన్ను మొట్టమొదటి సన్మానించిన ఆర్యవైశ్యులే మళ్లీ నేను నాలుగోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సందర్భంలో మొట్టమొదటి సన్మానం చేయటం నేను మరువలేనిది అని ఆయన అన్నారు. నేను గత సంవత్సర కాలం ముందే విజయం సాధిస్తానని నమ్మకం రావడానికి ముఖ్య కారణం తన కుమారుడు నవీన్ పాదయాత్రలో జగ్గంపేటలో ఆర్యవైశ్య మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారిని అప్పుడే నేను రాబోయే ఎన్నికల విజయం సాధిస్తానన్న నమ్మకం ఏర్పడిందని అన్నారు. మీ అందరి సహకారంతో నేను ఎన్నికల్లో ఇచ్చిన నాలుగు హామీలు సాగునీరు, త్రాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తానని జ్యోతుల నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి రమేష్, ఎస్ వి ఎస్ అప్పలరాజు, అత్తులూరి నాగబాబు, మారిశెట్టి భద్రం, కొత్త బైరవకృష్ణ, పాలకుర్తి సురేష్, పాంద్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, వేములకొండ జోగారావు, చిత్రపు బాబు, మానేపల్లి బంగార్రాజు, కంచర్ల బాబు, పైడిపాల సూరిబాబు, రేఖ బుల్లి రాజు, బోదిరెడ్డి శ్రీనివాస్, గవర సుధాకర్, నరేష్, ఐ.రాజు ఆర్యవైశ్య సంఘం సభ్యులు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సత్తెమ్మ అమ్మవారి పూజా కార్యక్రమాలు

కాకినాడ, మేజర్ న్యూస్ : ఆషాఢ మాసం సందర్భంగా అంగర సత్తిబాబు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కోటయ్యరెడ్డి వీధిలో వేంచేసియున్న శ్రీ సత్తెమ్మ అమ్మవారికి పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ పూజా కార్యక్రమాలకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వేంకటేశ్వరరావు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని విశేష పూజలు చేశారు.

ఈ టీడిపి ప్రభుత్వ హయాంలో మరిన్ని అభివృద్ధి కార్యక్ర మాలు చేపడతామని, సంక్షేమ పథకాలు అందరికీ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ సత్తెమ్మ అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి అన్నప్రసాదమును స్వీకరించి తరించారు.

# అల్లూరి స్ఫూర్తితో పేదలకు సేవ చేయడమే లక్ష్యం





**ఆశ్రం ఆసుపత్రి, కాలేజీ వ్యవస్థాపకులు గోకరాజు గంగరాజు**

**ఏలూరు, మేజర్‌న్యూస్:** ఆశ్రం హాస్పిటల్స్ స్థాపించి 25 ఏళ్లు అయిన సందర్భంగా రజతోత్సవ వేడుకలను ఆదివారం ఆశ్రం హాస్పటల్లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం హాస్పిటల్ స్థాపించిన గోకరాజు గంగరాజు జన్మదినం ఇదే రోజు కావడంతో ఆయన పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆశ్రమ హాస్పిటల్ లో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు, డాక్టర్లు గోకరాజు గంగరాజు ని శాలువాలు కప్పి సన్మానం చేశారు. తరువాత కేక్ కటింగ్ నిర్వహించారు. అనంతరం కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ నాణ్యమైన వైద్య విద్యను అందించడం, సమాజానికి సేవ చేయడమే లక్ష్యంతో ఆశ్రమం కాలేజ్ ని గంగరాజు స్థాపించారని తెలియజేశారు. తర్వాత హాస్పిటల్ డైరెక్టర్ రతీదేవి మాట్లాడుతూ ఆశ్రమం కాలేజ్ స్థాపించిన నాటి నుంచి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొందని, కష్ట సమయాల్లో వారితో నిలబడిన ప్రతి ఒక్క ఉద్యోగికి ధన్యవాదాలు తెలుపుతున్నాను అని అన్నారు. కాలేజీ స్థాపించినప్పుడు ఎంబిబిఎస్ కోర్సుకు 100 సీట్లు మాత్రమే ఉండేవని , ఈరోజు 250 సీట్లకు పెరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ చదివిన ఎంతో మంది విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. వారు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలబడిన సీఈవో హనుమంతరావుకి ధన్యవాదాలు తెలుపుతున్నామనిఅన్నారు. తర్వాత సీఈఓ హనుమంతరావు మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడమే లక్ష్యంతో గోకరాజు గంగరాజు ఆశ్రమ హాస్పిటల్ ను ప్రారంభించారని, ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఆయన వెనకడుగు వేయలేదని అన్నారు. ఆయన మంచితనమే ఆశ్రం హాస్పిటల్ ఎదుగుదలకు దోహద పడింది అని అన్నారు. కాలేజ్ స్థాపించి నేటికి 25 సంవత్సరాల పూర్తి చేసుకుందని తెలిపారు. రజతోత్సవ వేడుకలను నేటి నుంచి 2025 జూలై వరకు నిర్వహిస్తామని తెలియజేశారు.

అనంతరం గోకరాజు గంగరాజు మాట్లాడుతూ ఆశ్రమం కాలేజీతో పాటు జిల్లా వ్యాప్తంగా ఎన్నో విద్యాసంస్థలు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, నీతి నిజాయితీ తోడుగా ఉన్నప్పుడే ఎంతో ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పేదలకు సేవ చేయాలనే సంకల్పం తోడుగా భగవంతుడు ఇచ్చినటువంటి సంపదను పదిమందికి పంచడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఈ సందర్భంగా సీఈఓ హనుమంతరావు విలేకరులతో మాట్లాడుతూ ఆశ్రమ వ్యవస్థాపకులు చైర్మన్ గోకరాజు గంగరాజు జన్మదిన వేడుకలకు విచ్చేసిన మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజుకు, అదేవిధంగా ఇచ్చటకు విచ్చేసిన ముఖ్య అతిథులకు కాలేజీ సిబ్బందికి విద్యార్థి విద్యార్థులకు అందరికి కృతజ్ఞతలుతెలుపుతున్నట్టు వివరించారు.


# 10 గంటల నుంచి 1:00 వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

## - జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలి - జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లా స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ( పీజీఆర్ఎస్) కార్యక్రమం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ హాలు నందు ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 1:00 వరకు నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు. అదేవిధంగా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకార్యక్రమం పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి పెద్దాపురంలోని మట్టే వారి కళ్యాణ మండపంలో సోమవారం ఉదయం 10:00 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు జరుగుతుందన్నా రు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి పెద్దాపురం నియోజకవర్గం పరిసర ప్రాంతాల ప్రజల నుంచి వినతులను స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన దిగువ స్థాయి అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, నియోజకవర్గ అధికారులు ఉదయం 9.30 నిమిషాలకు పెద్దాపురం మట్టే వారి కళ్యాణ మండపంలో ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు.

## జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలి

**- ఏలూరు ఇంచార్జ్ రెడ్డి అప్పల నాయుడు**



**ఏలూరు,మేజర్ న్యూస్:** జనసేన పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ కూనిశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో 12 వ డివిజన్ నాయకులు, కార్యకర్తలతో జనసేన ఇంచార్జ్ రెడ్డి అప్పలనాయుడు సమక్షంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన నాయకులకు రెడ్డి అప్పల నాయుడు దిశా నిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. 12వ డివిజన్లో ఎటువంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని, వాటికి పరిష్కార మార్గం చూపుతానని,త్వరలోనే ఈ డివిజన్లో జనసేన పార్టీ నూతన కమిటీని ఏర్పాటు చేస్తామని,12వ డివిజన్‌లో ఉన్న వార్డులోకి వచ్చి నేరుగా స్థానిక సమస్యల మీద అవగాహన చేసుకొని పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని వారికి భరోసా ఇచ్చారు.

## జార్జి పేటలో మంచినీటి సమస్యకు పరిష్కారం

ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ చొరవ



**చింతలపూడి, మేజర్ న్యూస్:** చింతలపూడి శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ ఆదేశాల మేరకు జార్జి పేట గ్రామంలో ఎన్నో సంవత్సరాల నుండి. మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న తరుణంలో సమస్యకు పరిష్కారం దొరికింది. ప్రగడవరం సర్పంచ్ తొమ్మండ్రు భూపతి. ఉప సర్పంచ్ ఎస్ రమేష్ రెడ్డి, పంచాయతీ నిధులతో డ్రిల్ బోరు వేయించగా. మూడు అంగుళాలు నీళ్లు పడినందుకు జార్జి పేట గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కి, సర్పంచ్ భూపతికికి ధన్యవాదాలు తెలియజేశారు. సర్పంచ్ భూపతి. మాట్లాడుతూ. పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మరి కొద్ది రోజులలోజార్జి పేట నుండి తారు రోడ్డు వరకు. వీధి లైట్లు వేయిస్తానని అన్నారు. ఇప్పుడు వేసిన బోరుకు వెంటనే మోటర్ బిగించిట్యాంకు డ్రింకింగ్ వాటర్ ఎక్కిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో. టిడిపి లీడర్ కేటీఆర్. డోలా యేసు పాదం. డోలా డేవిడ్. గాదే కిరణ్. డోలా సోలోమన్. గ్రామస్తులు పాల్గొన్నారు.